ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 02 సంచిక -322 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 9 మార్చి 2026


సంజూ శాంసన్ (89)

# ఛాంపియన్ భారత్...

## టీ20 ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర..
## న్యూజిలాండ్ పై అల్టిమేట్ విక్టరీ

- 2007, 2024 తర్వాత మూడోసారి టీ20 ప్రపంచకప్ కైవసం చేసుకున్న భారత్
- పొట్టి కప్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి జట్టుగా టీమిండియా ప్రపంచ రికార్డు
- ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయం
- బ్యాటింగ్‌లో సంజూ శాంసన్ (89), బౌలింగ్‌లో బుమ్రా (4/15) అద్భుత ప్రదర్శన
- అహ్మదాబాద్ వేదికగా 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన భారత్


బుమ్రా (4/15

ఐసీసీ టీ20 ప్రపంచకప్‌కు భారత్ ముచ్చటగా మూడో ముద్దు ఇచ్చింది. 2007లో ఎం.ఎస్ ధోని తొలిసారి భారత్‌ను టీ20 ప్రపంచకప్ విజేతగా నిలుపగా.. 2024లో రోహిత్ శర్మ సారథ్యంలో టీమ్ ఇండియా విజేతగా అవతరించింది. సొంతగడ్డపై డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో నిలిచిన భారత్‌ను సూర్యకుమార్ యాదవ్ 2026లో చాంపియన్‌గా నిలబెట్టాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ను మూడుసార్లు నెగ్గిన ఏకైక జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. - మార్చి 08 (రిపబ్లిక్ న్యూస్):

మిగతా 2లో.



### 30 నెలల్లో పాలమూరు-రంగారెడ్డి
# పూర్తిచేస్తాం

- రాష్ట్ర వ్యాప్తంగా భూ సేకరణకు రూ.5 వేల కోట్లు కేటాయిస్తాం
- బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్ట్‌లను నిర్లక్ష్యం చేసింది
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



**హైదరాబాద్‌మార్చి 08 (రిపబ్లిక్ న్యూస్):**
పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను 30నెలల వ్యవధిలో పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ జలసౌధలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్ట్‌లపై మంత్రులు

మిగతా 2లో.

### మహిళాభివృద్ధి కోసం
# ‘స్వయం’ బ్రాండ్..

## నేనే అంబాసిడర్‌గా ఉంటా: సీఎం చంద్రబాబు

- అమరావతిలో కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని ప్రకటన
- డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం



**అమరావతి, మార్చి 08 (రిపబ్లిక్ న్యూస్):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సభకు భారీగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తాను, ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముగ్గురం కలిసి మహిళల

మిగతా 2లో.

### ఆస్పత్రుల్లో
# ఏఐ సేవలు

పైలట్‌గా 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో వినియోగం: మంత్రి సత్యకుమార్



**అమరావతి, మార్చి 08 (రిపబ్లిక్ న్యూస్):**
: కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంతో వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో ఎంపి క చేసిన 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో 18 మంది ఇన్నోవేటర్లు ఏకకాలంలో 40 పరికరాల ద్వారా వైద్య సేవల్లో కీలకమైన స్క్రీనింగ్, కన్ఫర్మేషన్ పరీక్షలు చేస్తున్నారన్నారు.

మిగతా 2లో.

# ఇరాన్‌లో ఇంధన నిల్వ కేంద్రాలపై దాడులు

- అంతరిక్ష సంస్థ హెడ్‌క్వార్టర్స్, ఇస్ఫహాన్ ఎయిర్‌పోర్ట్ ధ్వంసం
- ‘గల్ఫ్’లోని చమురు రిఫైనరీలు, ఎయిర్‌పోర్ట్‌లపై ఇరాన్ దాడులు
- బహ్రెయిన్‌లోని అమెరికా నేవీ బేస్‌పై దాడి
- సౌదీలో ఒక భారతీయుడు సహా ఇద్దరి మృతి
- కువైట్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుపై క్షిపణి దాడి
- ఉప్పు నీటిని తాగునీటిగా మార్చే కేంద్రాలపైనా పరస్పరం దాడులు
- ఇరాన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన గల్ఫ్ దేశాలు
- తమ రక్షణకు అమెరికా బేస్‌లపై దాడి చేసే హక్కు ఉందన్న ఇరాన్

**దుబాయ్/ మార్చి 08 (రిపబ్లిక్ న్యూస్):**
పశ్చిమాసియా యుద్ధం ప్రమాదకర మలుపు తిరుగుతోంది. ఇరువైపులా ఎవరూ వెనక్కి తగ్గని స్థితిలో పరస్పర దాడులు మిలిటరీ, రక్షణ పరిమితులు దాటి విపరీత పరిణామాల వైపు దారితీస్తున్నాయి. పౌర ఆస్తులు, చమురు రిఫైనరీలు, చమురు నిల్వ కేంద్రాలు,

మిగతా 2లో.



### కాలేజీ అమ్మాయిలకు
# ఉచిత ఈవీ స్కూటీలు

- ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట..
- ఆర్థికంగా శక్తిమంతులను చేస్తున్నాం
- జర్నలిస్టులకు ఫ్యూచర్‌సిటీలో మోడల్ కాలనీ
- ఇళ్ల స్థలాలపై త్వరలోనే తీపి కబురు చెబుతాం
- ఫీల్డ్, డెస్క్ జర్నలిస్టుల మధ్య తేడా లేకుండా అందరికీ న్యాయం చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రజాభవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవం




**హైదరాబాద్, మార్చి 08 (రిపబ్లిక్ న్యూస్):**
కాలేజీ విద్యార్థినులకు త్వరలో ఉచితంగా ఎలక్ట్రిక్ (ఈవీ) స్కూటీలు అందించబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఆ వాహనాలకు జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నగరంలో కాలుష్యాన్ని వెదజల్లుతున్న 2500 ఆర్టీసీ డీజిల్ బస్సులను డిసెంబరులోపు జిల్లాలకు తరలించి, వాటి స్థానంలో పూర్తి స్థాయిలో ఈవీ బస్సులను ప్రవేశపెడతామన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళా జర్నలిస్టులను సన్మానించిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఏటా మహిళా దినోత్సవం నాడు కేవలం శుభాకాంక్షలు చెప్పడమే కాకుండా.

మిగతా 2లో.

# ఛాంపియన్ భారత్...



టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా మరోసారి విశ్వరూపం చూపించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన తుది పోరులో న్యూజిలాండ్‌ను చిత్తుచేసి విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయంతో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 2007, 2024 తర్వాత ఇది టీమిండియాకు మూడో టీ20 వరల్డ్ కప్ కావడం విశేషం. మూడు సార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలిజట్టుగా టీమిండియా రికార్డు నెలకొల్పింది. దాంతోపాటే, ఆతిథ్య జట్టు వరల్డ్ కప్ నెగ్గడం కూడా ఇదే తొలిసారి. అంతేకాదు, టీ20 ప్రపంచకప్ చరిత్రలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగి, టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టుగా టీమిండియా రికార్డులకెక్కింది. సొంతగడ్డపై జరిగిన ఈ మెగా ఫైనల్లో భారత్ ఏకంగా 96 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించి ట్రోఫీని ముద్దాడింది.

256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. భారత బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భారత పేస్ దళపతి జస్ప్రీత్ బుమ్రా తన మ్యాజిక్ బౌలింగ్‌తో కివీస్ పతనాన్ని శాసించాడు. కేవలం 15 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ టిమ్ సీఫెర్ట్ (52), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (43) మాత్రమే పోరాడారు. వీరిద్దరూ మినహా మిగిలిన బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలవలేకపోయారు. ముఖ్యంగా డారిల్ మిచెల్ (17), ఫిన్ అలెన్ (9), రచిన్ రవీంద్ర (1) వంటి స్టార్ ప్లేయర్లు విఫలమవడంతో కివీస్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో బుమ్రా 4, అక్షర్ పటేల్ 3 వికెట్లు పడగొట్టగా.. హార్దిక్, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ తలో వికెట్ దక్కించుకున్నారు.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. న్యూజిలాండ్ బౌలర్లపై విరుచుకుపడింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. తొలి వికెట్‌కు వీరిద్దరూ కేవలం 7.1 ఓవర్లలోనే 98 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అభిషేక్ శర్మ 21 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 52 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అతడు కేవలం 18 బంతుల్లోనే 50 పరుగులు చేశాడు. ఈ మెగా టోర్నీలో ఇదే ఫాస్టెస్ట్ ఫిఫ్టీ.

ఆ తర్వాత ఇషాన్ కిషన్ (54)తో కలిసి సంజూ శాంసన్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ముఖ్యంగా శాంసన్ కివీస్ బౌలర్లను ఊచకోత కోశాడు. 46 బంతుల్లో 5 ఫోర్లు, ఏకంగా 8 సిక్సర్లతో 89 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. చివర్లో శివమ్ దూబే (26 నాటౌట్) ధాటిగా ఆడటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూర్యకుమార్ యాదవ్ డకౌట్ అయినా.. టీమిండియా సమిష్టి ప్రదర్శనతో మూడోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది.

# ఆస్పత్రుల్లో ఏఐ సేవలు

**మొదటిపేజీ తరువాయి**

దీనివల్ల తక్కువ సమయంలోనే వ్యాధి నిర్ధారణ అవుతుందని, దీంతో రోగులకు చికిత్స అందించేందుకు వైద్యులకు సమయం ఆదా అవుతుందని చెప్పారు. విశాఖపట్నం, అనంతపురం, గుంటూరు, కాకినాడ ప్రభుత్వాస్పత్రుల్లో, సిద్ధార్థ మెడికల్ కాలేజీ, పార్వతీపురం, తెనాలిలోని జిల్లా ఆస్పత్రి, ఇతర చోట్ల పైలట్ ప్రాజెక్టు విధానంలో వివిధ రకాల పరీక్ష లు చేస్తున్నామని చెప్పారు. రోగులు, వైద్యుల మధ్య జరిగే సంభాషణను రికార్డింగ్ చేయడం, దగ్గు ద్వారా టీబీని గుర్తించడం, గుండెజబ్బులు, రక్తహీనతను గుర్తించడం, సర్వైకల్ క్యాన్సర్ చికిత్సలో ఏఐ కెమెరా వినియోగం, చిన్నపిల్లల్లో న్యూరాలజికల్ డిజార్డర్స్, క్యాటరాక్ట్, గ్లౌకోమా, రక్తహీనత, ఇతర పరీక్షలకు ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగిస్తారని తెలిపారు. ఇటీవల ఆస్పత్రుల్లో పైలట్ విధానంలో ప్రారంభమైన వీటి ఫలితాలపై సీఎం చంద్రబాబుకు నివేదిక అందిస్తామని మంత్రి తెలిపారు.

# 30 నెలల్లో పాలమూరు -రంగారెడ్డి పూర్తిచేస్తాం



**మొదటిపేజీ తరువాయి**

జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ నీటి పారుదల రంగాన్ని నిర్వీర్యం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండేండ్లలోనే ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాస పనులకు గాను (జూన్ 2 నాటికి) రూ.5వేల కోట్లు విడుదల చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కృష్ణా, గోదావరి రెండు బేసిన్లలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అత్యధిక వరి పండిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశామంటూ గత పాలకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రూ.55 వేల కోట్ల ప్రాజెక్ట్‌లో రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తే అది 90 శాతం పూర్తయినట్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. వారి హయాంలో నే పాలమూరు అంచనాలను రూ.84 వేల కోట్లకు పెంచారని మండిపడ్డారు. రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికి నీరివ్వలేదని ఆరోపించారు. పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో ఆఫ్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల లిఫ్ట్ ఖర్చులు పెరిగి రాష్ట్రానికి నష్టం జరిగిందన్నారు.

ఇదే తరహాలో కాళేశ్వరం లిఫ్ట్ ఎత్తిపోతల పథకాన్ని తుమ్మిడి హట్టి నుంచి మేడిగడ్డకు మార్చడంతో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌పై రూ.7,161 కోట్లు ఖర్చు చేసినట్టు మంత్రి తెలిపారు. ఇందులో ప్రాజెక్ట్ పనులకు రూ.6,718 కోట్లు, భూసేకరణకు రూ.284.71 కోట్లు, పునరావాసానికి రూ.63.65 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.94 కోట్లు వినియోగించినట్టు వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా ప్రాజెక్టులను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. 2014 జూన్ 2న ఎలా ఉన్నాయో 2024 జూన్ 2న కూడా అలాగే ఉన్నాయని చెప్పారు. ఎంత ఖర్చయినా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించామని చెప్పారు. కల్వకుర్తికి రూ.909 కోట్లు, నెట్టెంపాడుకురూ.252 కోట్లు, భీమాకు రూ.200 కోట్లు, కోయిలసాగర్‌కు రూ.185 కోట్లు కేటాయింపులు జరిగాయని వివరించారు.

# మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్..

**మొదటిపేజీ తరువాయి**

అభ్యున్నతికి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సృష్టికి మూలం మహిళ అని, ప్రేమ, త్యాగం, కష్టానికి వారు ప్రతిరూపమని కొనియాడారు. తెలుగింటి ఆడబిడ్డలకు, దేశంలోని మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంగానే కాకుండా ఒక అన్నగా, తండ్రిగా ఆడబిడ్డలను ప్రోత్సహించి ఉన్నత స్థానాలకు తీసుకురావడానికి తన సర్వశక్తులూ ఒడ్డుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, దానివల్ల తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి పేదలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, డ్వాక్రా, మెప్మా సంఘాలకు పూర్వ వైభవం తీసుకురావడమే తమ ఆలోచన అని పునరుద్ఘాటించారు. మహిళలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన అన్నారు.

"మా ఆడబిడ్డలు తయారుచేసే వస్తువులకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో 'స్వయం' బ్రాండ్‌ను ప్రారంభించాం. ఈ బ్రాండ్‌కు నేనే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను. నాణ్యత, ప్యాకేజింగ్, టెక్నాలజీ వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 84 లక్షల మందికి పైగా డ్వాక్రా సభ్యులున్నారు. వారందరినీ ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే మా సంకల్పం" అని వివరించారు.

ఇప్పటికే లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని, రాబోయే ఏడాదిలో మరో 5 లక్షల మందిని



చేర్చి మొత్తం 6 లక్షల మందితో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసే వస్తువులను వారే వినియోగించుకుంటే దాదాపు మూడున్నర కోట్ల మంది వినియోగదారులు ఏర్పడతారని, ఇది మార్కెటింగ్‌కు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.

ఈ సందర్భంగా ఆయన పలువురు మహిళా ప్రముఖులను ప్రశంసించారు. దేశానికి రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము, ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. వచ్చిన ఆదాయాన్ని సమర్థంగా వినియోగించి కుటుంబాన్ని నడిపే మహిళలే నిజమైన ఆర్థిక మంత్రులని చంద్రబాబు అభివర్ణించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కూడా ప్రధాన న్యాయమూర్తిగా ఒక మహిళ రాబోతున్నారని తెలపడం సంతోషంగా ఉందన్నారు.

దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుంటూ, ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి చట్టం చేసిన ఘనత ఆయనదేనని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది, మహిళల కోసం ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది కూడా ఎన్టీఆరే అని గుర్తుచేశారు.

తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాలు, కళాశాలల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించానని, ఆ నిర్ణయం వల్లే నేడు ఐటీ వంటి రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని వివరించారు. భవిష్యత్తులో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు రాబోతున్నాయని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రాజకీయాల్లోకి రావడానికి మహిళలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళల భద్రత విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే, అదే వారికి చివరి రోజు అవుతుంది. అలాంటి దుర్మార్గులను కఠినంగా హెచ్చరిస్తున్నా. మీ భద్రతకు చంద్రన్న ఉన్నంతవరకు భయపడాల్సిన అవసరం లేదు," అని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర హోంమంత్రిగా కూడా ఒక మహిళే (అనిత) ఉన్నారని, ఎక్కడ సమస్య ఎదురైనా తక్షణమే స్పందిస్తారని గుర్తుచేశారు. ఇదే సమయంలో, రాష్ట్రంలో జనాభా తగ్గుదలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఒకప్పుడు 'ఒక బిడ్డ ముద్దు, ఇద్దరు ఓకే, ముగ్గురు వద్దు' అన్నాను. కానీ ఇప్పుడు 'ఒక బిడ్డ వద్దు, ఇద్దరు ఓకే, ముగ్గురు ముద్దు' అని చెబుతున్నాను. రాష్ట్రంలో జననాల రేటు 1.5కి పడిపోయింది. ఇది ప్రమాదకరం. అందుకే పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేందుకు అవసరమైతే మూడు పడకగదుల ఇల్లు, అదనపు రేషన్ వంటి ప్రోత్సాహకాలు అందిస్తాం" అని నూతన విధానాన్ని ప్రకటించారు.

# ఇరాన్‌లో ఇంధన నిల్వ కేంద్రాలపై దాడులు

**మొదటిపేజీ తరువాయి**

విమానాశ్రయాలు వంటి కీలక మౌలిక సదుపాయాల విధ్వంసం వైపు అడుగులు పడుతున్నాయి. ఇరాన్‌లోని విమానాశ్రయాలు, పారిశ్రామిక ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించిన ఇజ్రాయెల్, అమెరికా.. తాజాగా పెట్రోలియం నిల్వ కేంద్రాలను, తాగునీటి కోసం ఉద్దేశించిన డీసాలినేషన్ ప్లాంట్లనూ లక్ష్యంగా చేసుకున్నాయి. ఇరాన్ అంతరిక్ష సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేశాయి. ఈ దాడుల్లో ఆస్పత్రులు, స్కూళ్లు కూడా దెబ్బతింటున్నాయి. మరోవైపు అరబ్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలతోపాటు చమురు రిఫైనరీలు, పౌర విమానాశ్రయాలు, హోటళ్లు, జనావాసాలపైనా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు పడుతున్నాయి. తాజాగా డీసాలినేషన్ ప్లాంట్లపైనా ఇరాన్ డ్రోన్లు ప్రయోగిస్తోంది.

ఇరాన్ రాజధాని టెహ్రాన్ శివార్లలో, అల్బోర్జ్ ప్రావిన్స్‌లో ఉన్న నాలుగు భారీ ఇంధన నిల్వ కేంద్రాలు, ఒక డిస్ట్రిబ్యూషన్ కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ ఆదివారం దాడి చేశాయి. దీనితో పెట్రోలియం ఉత్పత్తులన్నీ అంటుకుని, భారీగా పేలుళ్లు, మంటలు చెలరేగాయి. సమీప ప్రాంతాలన్నీ నల్లటి విషవాయువులతో నిండిపోయాయి. ఈ ఘటనలో ఆరుగురు మరణించారని, 21 మంది గాయపడ్డారని ఇరాన్ వార్తా సంస్థ టాస్నిమ్ వెల్లడించింది. కాగా "యుద్ధంలో ఇదొక ప్రమాదకరమైన పరిణామం. ఇంధన కేంద్రాలపై దాడితో ప్రమాదకర, విషపూర్తి రసాయనాలు వెలువడుతున్నాయి. సాధారణ ప్రజలు వాటిని పీల్చుకోవాల్సి వస్తోంది. పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇది తీవ్రమైన యుద్ధనేరం కిందకే వస్తుంది" అని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. ఇరాన్ మిలటరీ వ్యవస్థలకు ఇంధనాన్ని సరఫరా చేస్తున్నందునే ఆయిల్ డిపోలపై దాడి చేశామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటించింది. కాగా, ఇంధన కేంద్రాలపై దాడుల నేపథ్యంలో.. ఇరాన్ ప్రభుత్వం ప్రజలకు అందించే ఇంధన కోటాను వారానికి 30 లీటర్ల నుంచి 20 లీటర్లకు తగ్గించింది.

## ఇరాన్ అంతరిక్ష సంస్థ హెడ్‌క్వార్టర్స్ ధ్వంసం

టెహ్రాన్‌లోని ఐఆర్‌జీసీ స్పేస్ ఫోర్స్ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్ అంతరిక్ష సంస్థకు చెందిన పరిశోధన, కమాండ్ కంట్రోల్ కేంద్రాలు ఈ కార్యాలయంలోనే ఉన్నాయని.. ఇజ్రాయెల్‌పై నిఘా కోసం ఇరాన్ ప్రయోగించిన ఖయ్యామ్ ఉపగ్రహ నియంత్రణ విభాగం కూడా ఇందులోనే ఉందని పేర్కొంది. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ ఎయిర్‌పోర్టులో ఎఫ్-14 యుద్ధ విమానాలను, క్షిపణి రక్షణ వ్యవస్థను ధ్వంసం చేశామని వెల్లడించింది. నార్వేలోని అమెరికా ఎంబసీ వద్ద ఆదివారం పేలుడు సంభవించింది. అయితే ఈ పేలుడుతో పెద్దగా నష్టమేమీ జరగలేదని, ఎవరికీ గాయాలు కాలేదని నార్వే వెల్లడించింది. పేలుడుకు పాల్పడినవారి కోసం గాలిస్తున్నట్టు తెలిపింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఎంబసీలపై ఇరాన్ డ్రోన్ దాడుల నేపథ్యంలో నార్వేలో పేలుడు చర్చనీయాంశంగా మారింది. ఇరాన్‌కు మద్దతుగా రంగంలోకి దిగిన హెజ్బొల్లా తీవ్రవాద సంస్థను అణచివేసేందుకు ఇజ్రాయెల్ భారీ స్థాయిలో దాడులు చేస్తోంది. లెబనాన్‌లోని 20 పట్టణాల్లో క్షిపణులు, యుద్ధ విమానాలతో విరుచుకుపడుతోంది. ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్‌లో మృతుల సంఖ్య 394కు పెరిగిందని, అందులో 83 మంది పిల్లలు ఉన్నారని లెబనాన్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఇరాన్‌వ్యాప్తంగా 10 వేల పౌర ఆవాసాలు ధ్వంసమయ్యాయని రెడ్ క్రిసెంట్ సొసైటీ తెలిపింది. ఇరాన్ దాడుల్లో 1,929 మంది తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఇజ్రాయెల్ ఆరోగ్య శాఖ ఆదివారం వెల్లడించింది.

# కాలేజీ అమ్మాయిలకు ఉచిత ఈవీ స్కూటీలు

**మొదటిపేజీ తరువాయి**

. వేలాది మంది ఆడబిడ్డలను పిలిచి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నామని తెలిపారు. "200 బిలియన్ డాలర్ల ఎకానమీగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 8 ఏళ్లలో ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడం కోసం పనిచేస్తున్నాం. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేసి అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించాం. కోటి 30 లక్షల జనాభా ఉన్న క్యూర్ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టర్‌గా మారుస్తాం. సౌత్ కొరియా, న్యూయార్క్, టోక్యోతో హైదరాబాద్ పోటీపడేలా ప్రయత్నం చేస్తున్నాం. ఈ ప్రయాణంలో మహిళలే రాష్ట్రానికి వెన్నెముక" అని సీఎం అన్నారు.

దేశంలో రాష్ట్రపతి, ప్రధాని, లోక్‌సభ స్పీకర్, ముఖ్యమంత్రులు, పార్టీ అధ్యక్షులుగా మహిళలకు అన్ని అత్యున్నత పదవులు ఇచ్చింది కాంగ్రె స్సేనని సీఎం రేవంత్ అన్నారు. ఉక్కు మహిళ సోనియాగాంధీ స్ఫూర్తితోనే తెలంగాణ ఏర్పడిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో కలెక్టర్లు, ఎస్పీలుగా ఎక్కడ ఏ అవకాశం వచ్చినా మహిళా అధికారులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ముఖ్యమైన శాఖలకు మహిళలు బాధ్యత వహిస్తున్నారని, హైదరాబాద్ లాంటి కీలక జిల్లాకు కలెక్టర్‌గా మహిళ ఉన్నారని తెలిపారు. ఎస్ఐబీలో పనిచేస్తున్న ఒక మహిళా అధికారి చొరవతో 700 మంది మావోయిస్టులు లొంగిపోవడం మహిళల కార్యదీక్షకు నిదర్శనమని కొనియాడారు. మహిళలను తాము కేవలం లబ్ధిదారులుగా చూడటం లేదని, వారిని ఆర్థికంగా శక్తివంతులను చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడమే కాకుండా.. 1000 బస్సులకు మహిళలను యజమానులను చేసి కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడేలా చేశామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల యజమానులుగా మారుస్తున్నామని వెల్లడించారు.

'దేశ రాజధాని ఢిల్లీ.. వాయు కాలుష్యం వల్ల ఇబ్బంది పడుతోంది. ముంబై కూడా అనేక సమస్యలతో ఇబ్బంది పడుతోంది. చెన్నైలో వరదల సమస్య ఉంది. దేశంలోనే బెస్ట్ సిటీ హైదరాబాద్. చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌ను తీర్చిదిద్దారు. రెడ్, ఆరెంజ్ క్యాటగిరీ



పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు బయటకు పంపిస్తాం' అని సీఎం రేవంత్ అన్నారు. అంతర్జాతీయ స్థాయికి నగరాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ ఇప్పుడు ఆరెం జ్ క్యాటగిరీలో ఉందని, ఇలాగే వదిలేస్తే.. రెడ్ జోన్‌లోకి వెళుతోందని పేర్కొన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై విపక్షాల తీరును సీఎం తప్పుబట్టారు. అహ్మదాబాద్‌లో సబర్మతి, ఢిల్లీలో యమునా, యూపీలో గంగానది రివర్ ఫ్రంట్లు కట్టినప్పుడు లేని అభ్యంతరం హైదరాబాద్‌లో ఎందుకు? అని ప్రశ్నించారు. అహ్మదాబాద్‌లో 10 వేల కుటుంబాలను తరలించి సరైన సౌకర్యాలు కల్పించలేదని, నదులకు 50 మీటర్ల బఫర్ జోన్ ఏర్పాటు చేస్తూ తరువాత నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. 50 మీటర్ల లోపుల కట్టడాలపై నిషేధం ఉందని, అందుకే వాళ్లను పిలిచి మాట్లాడి చెప్పామని అన్నారు. వాళ్లకు 7 ఎకరాల భూమి ఇచ్చి.. అందులో అపార్ట్‌మెంట్ కట్టుకోవడానికి కావాల్సిన డబ్బును డిపాజిట్ చేస్తామన్నామని చెప్పారు. కానీ, దీనికి రాజకీయ రంగు పూసి.. ప్రతి పార్టీ అక్కడికి వెళ్లి సానుభూతి చూపుతున్నాయని విమర్శించారు. సానుభూతికి సమస్య పరిష్కారం కాదన్నారు. నగరాన్ని కాపాడుకోవడానికి అందరి సహకారం కావాలని, దీనిపై ఈ నెల 13న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని చెప్పారు.

తన ప్రయాణంలో అనేక మంది జర్నలిస్టులు, మహిళా జర్నలిస్టులు శ్రేయోభిలాషులుగా ఉన్నారని సీఎం రేవంత్ తెలిపారు. ఫీల్డ్, డెస్క్ జర్నలిస్టుల మధ్య తేడా లేకుండా అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 'జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై త్వరలోనే మంచి వార్త చెబుతాం. చట్టం వల్ల ఇబ్బంది లేకుండా ఇళ్ల స్థలాలపై నిర్ణయం తీసుకుంటాం. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టుల కోసం ఒక అద్భుతమైన కాలనీని డిజైన్ చేస్తాం' అని సీఎం ప్రకటించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు కథనాలపై ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేస్తామన్నారు. జర్నలిస్టుల ముసుగులో కొందరు చేసే పనులను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. 'గతంలో ప్రగతి భవన్‌లోకి మహిళా జర్నలిస్టులు ఎంత మంది వచ్చారు? ఇప్పుడు అంతా వస్తున్నారు. ఇది ప్రజా వేదిక' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజరుద్దీన్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఐ అండ్ పీఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888
సోమవారం 9 మార్చి 2026

# పంటలు పూర్తయ్యే వరకు కె.సి.కెనాల్ కు నీటిని విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిని కలిసిన పాములపాడు మండల రైతులు








**పాములపాడు మార్చి-8 రిపబ్లిక్ న్యూస్:-** ఈరోజు పాములపాడు మండలంలోని, నేషనల్ హైవే ఎన్ హెచ్ 340 సి రుద్రవరం గ్రామ టోల్ ప్లాజా వద్ద పాములపాడు, రుద్రవరం, తదితర గ్రామాలకు చెందిన రైతులు నందికొట్కూరు నియోజవర్గ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ని కలిసి తమ సమస్యలను వివరించారు. కె.సి.కెనాల్ కాల్వకు మల్లాల ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లు శాంతి నిలయం వరకు వస్తున్నప్పటికీ, అలగనూరు కాలువకు అధికారులు నీళ్లు విడుదల చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాములపాడు మండల పరిసర ప్రాంతాల్లో సుమారు 1500 ఎకరాల మొక్కజొన్న, మినుములు, కందుల పంటలు తీవ్రంగా నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రస్తుతం పంటలు చేతికి వచ్చే దశలో ఉండటంతో నీళ్లు అత్యవసరమని రైతులు విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యను అర్థం చేసుకున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి వెంటనే ఈఈ అధికారికి మరియు ఇతర సంబంధిత అధికారులకు ఫోన్ చేసి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, కనీసం ఒక నెల రోజుల పాటు అలగనూరు కాలువకు నీళ్లు విడుదల చేయాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు నియోజవర్గ టిడిపి యువ నాయకుడు & ప్రభుత్వ టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్ కురువ.రమేష్, నీటి సంఘం వైస్ చైర్మన్ కురువ వెంకటేశ్వర్లు, టేకూరి.సాయికృష్ణ, రుద్రవరం మాజీ సర్పంచ్ జాల.రామసుబ్బయ్య, హాఫీజ్ ఎస్ఎండి.బషీర్ అహ్మద్, జాల కుష్టమోహన్, పి డి ఎస్ యు ఇమ్రాన్ భాష, గొల్ల రమేష్, ఓ.ఏసన్న రామకృష్ణ, ఖాసిం వలీ, సుధాకర్, హనుమంతు, లక్ష్మన్న, షేక్షావలి, శ్రీరాములు, హోతుడు, ఏసన్న, తదితర రైతులు పాల్గొన్నారు.

# కొత్తూరు సుబ్బారాయుని సన్నిధిలో తెలంగాణ నిజామాబాద్ జూనియర్ సివిల్ న్యాయమూర్తులు.



**పాణ్యం, ప్రతినిధి,మార్చి,08(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానమును తెలంగాణ రాష్ట్రము నిజామాబాద్ జిల్లా, జూనియర్ సివిల్ జడ్జీలు హరికుమార్, సతీమణి జడ్జి చైతన్యలు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో యం.రామక్రిష్ణ అర్చకులు సురేష్ శర్మ, నారాయణ శర్మ, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామివారికి అభిషేకములు, అర్చనలు, పలు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వ మంటపము నందు పూలమాలలు, శాలువాలు, శేష వస్త్రముతో ఘనంగా సత్కరించి స్వామివారి ప్రసాదము, స్వామివారి చిత్రపటమును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, జడ్జిల బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా పోలీసుల సేవలు ప్రశంసనీయం

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేత -అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా







**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 8)**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పోలీసుల సేవలను ప్రశంసిస్తూ కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజయం సాధించిన మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేసినట్లు తెలిపారు. మహిళా పోలీసులు సమాజ భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. అమ్మలేనిదే సృష్టి లేదని పేర్కొంటూ, భారతదేశం "వసుధైవ కుటుంబకం" అనే భావనతో ముందుకు సాగుతోందన్నారు. సమాజ నిర్మాణంలో అందరూ కలిసి మెలిసి కృషి చేయాలని సూచించారు. మహిళల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో మహిళా పోలీసుల సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. అదే ఉత్సాహంతో ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ విధుల్లోనే కాకుండా క్రీడల్లో కూడా ప్రతిభ కనబరుస్తూ మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్న ఆర్ఎస్ఐ కల్పనను అడిషనల్ ఎస్పీ శాలువా, మెమెంటోతో ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఏఓ విజయలక్ష్మీ, డిటిఆర్బి సిఐ ఆదిలక్ష్మీ, ఆర్ఐ నారాయణ, మహిళా ఆర్ఎస్ఐలు కల్పన, మహాలక్ష్మి, మహిళా పోలీసు సిబ్బంది, శక్తి టీం సభ్యులు, మహిళా హోం గార్డు సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు 900 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు

- భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ
- కొత్త బురుజు గ్రామం పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహిస్తున్న స్పెషల్ పోలీస్ బలగాలు
- నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలి
- సీసీ కెమెరాలతో, డ్రోన్ కెమెరాలతో నిఘా కట్టుదిట్టం
- విధులలో నిర్లక్ష్యం వహించరాదు



**నంద్యాల క్రైం, మార్చి 8, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా పరిధిలోని డోన్ మండలం కొత్తబురుజు గ్రామం నందు నేడు (సోమవారం) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న సందర్భంగా ఆదివారం సుమారు 900 మంది పోలీస్ అధికారులు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికే కొత్త బురుజు గ్రామం, పరిసర ప్రాంతాలను ఇప్పటికే స్పెషల్ పార్టీ బృందాలు క్షుణ్ణంగా తనిఖీలు జరిగింది. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో పోలీస్ జాగిలాలతో బాంబు, డిటెక్షన్ టీం సహాయంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతరం భద్రతా పర్యవేక్షణ జరుగుతుంది. కొత్తబురుజు గ్రామంలో నిర్వహించే సభా ప్రాంగణానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాల పార్కింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు.

**సిబ్బందికి సూచనలు**

బందోబస్తుకు వచ్చిన అధికారులను సిబ్బందిని సమావేశపరిచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత నిర్వహించాలని దిశ నిర్దేశం చేయడం జరిగింది. ఎట్టి పరిస్థితులలో మీకు నియమించిన డ్యూటీ ప్రదేశాన్ని వదిలి వెళ్ళరాదు. ప్రజలు ఎక్కువగా తరలివచ్చే అవకాశం ఉన్నందున మీరు విధులు నిర్వహించు ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తతో విధులు నిర్వహించాలి. డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది విధులలో నిర్లక్ష్యం వహించరాదని, మీకు అప్పగించిన విధులను నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.




# నంద్యాల జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షునికి మాజీ మంత్రి బుగ్గన పరామర్శ




**బేతంచర్ల ప్రతినిధి, మార్చి 08,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**ఆదివారం రోజున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇటీవల నంద్యాల జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్,కి శాస్త్ర చికిత్స జరిగినందువలన వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. వారితో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, మండల అధ్యక్షులు సోమేష్ యాదవ్,పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి,మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామచంద్రుడు,పార్టీ నాయకులు ఆర్.ఇ రాజవర్ధన్ ,పాలుట్ల రఘురామ్,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**నంద్యాల క్రైం, మార్చి 8, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని నూనెపల్లె బొగ్గులైన్ రోడ్డు నందు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన కామిరెడ్డి రాజ ఇమ్మనియేల్ విన్సన్ చర్చిల్ (62) ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా వేగంగా దూసుకెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనగా ద్విచక్ర వాహనం పై వెళ్తున్న ఇద్దరిలో ఒకరైన కామిరెడ్డి రాజ ఇమ్మనియేల్ విన్సన్ చర్చిల్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పట్టణంలోని సెయింట్ లూక్స్ అంధుల పాఠశాలలో ఫీల్డ్ ఆఫీసర్ గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య కుమారుడు, కూతురు ఉన్నారు. నూనెపల్లె బొగ్గులైన్ రోడ్డు నందు అనేక రోడ్డు ప్రమాద ఘటనలో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# మహిళల రక్షణకు ఆదోనిలో వన్ స్టాప్ సెంటర్ ప్రారంభం

## మహిళల రక్షణకు ఆదోనిలో వన్ స్టాప్ సెంటర్ ప్రారంభం

## బాధిత మహిళలకు ఒకే చోట వైద్య, న్యాయ, పోలీసు సహాయం సబ్ కలెక్టర్ అజయ్ కుమార్





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 8)**
మహిళలపై జరిగే హింసాత్మక ఘటనలకు గురైన బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వన్ స్టాప్ సెంటర్ (ఓ ఎస్ సి) ను ఆదివారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మహిళలకు అత్యవసర సహాయం అందించే ఉమెన్ హెల్ప్ లైన్ 181 మరియు పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవలకు సంబంధించిన పోస్టర్లను కూడా ఆయన ఆవిష్కరించారు.

సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ, కుటుంబంలో, కార్యాలయాల్లో లేదా సమాజంలో హింసకు గురైన మహిళలకు ఒకే చోట సమగ్ర సహాయం అందించడమే వన్ స్టాప్ సెంటర్ లక్ష్యమని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా అత్యవసర స్పందన, రక్షణ సేవలు, వైద్య సహాయం, పోలీసు ఫిర్యాదుల నమోదు (ఎఫ్ఐ ఆర్/ఎన్ సిఆర్/డి ఐ ఆర్)లో సహకారం, మానసికసామాజిక కౌన్సెలింగ్, న్యాయ సహాయం, అవసరమైన వారికి తాత్కాలిక ఆశ్రయం వంటి సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వీడియో కాన్ఫరెన్సింగ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు.

వన్ స్టాప్ సెంటర్ సేవలు 18 సంవత్సరాల లోపు బాలికలు సహా అన్ని వయస్సుల మహిళలకు అందుబాటులో ఉంటాయని, కులం, మతం, వర్గం, ప్రాంతం లేదా వివాహ స్థితి వంటి భేదాలు లేకుండా హింసకు గురైన మహిళలు ఈ సేవలను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ మాట్లాడుతూ, కర్నూలు జిల్లాలో ఇది రెండో వన్ స్టాప్ సెంటర్ అని తెలిపారు. ఇప్పటికే కర్నూలులో ఒక కేంద్రం పనిచేస్తోందని చెప్పారు. హింసకు గురైన మహిళలకు పునరావాసం, న్యాయ సహాయం, వైద్య సేవలు, పోలీసు సహాయం వంటి అన్ని సేవలను ఒకే చోట అందించడమే ఈ కేంద్రం ఉద్దేశమని వివరించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 10 వన్ స్టాప్ సెంటర్లను ప్రారంభించగా, వాటిలో ఆదోని కేంద్రం కూడా ఒకటిగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మహిళల సాధికారత, భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారులు వీక్షించారు.

ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఢిల్లీశ్వరి, హాస్పిటల్ సూపరింటెండెంట్ ఎం. నాగరాజు, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా రిపబ్లిక్ కథనానికి వెంటనే స్పందించిన అధికారులు

**తల్లిదండ్రులు ఇబ్బంది పడకుండా నీటి సౌకర్యాన్ని కల్పించిన స్కూల్ ప్రిన్సిపాల్**





**కల్లూరు ప్రతినిధి, మార్చి 08,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

ఆదివారం రోజునకల్లూరు మండలం జగన్నాథం గట్టుపైన అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 01 తేదీన ఆదివారం ఇక్కడ పరీక్ష జరిగింది, ఆదివారం రోజున పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులకు నీటి వసతి లేక చాలా ఇబ్బందులు పడ్డారు, ఈ కథనాన్ని, ప్రజా రిపబ్లిక్ పేపర్లో రావడం వలన జగన్నాథం గట్టు పైన అంబేద్కర్ గురుకుల పాఠశాల, అధికారులు ప్రిన్సిపల్ వెంటనే స్పందించి 8 తేదీ ఆదివారం రోజున పరీక్ష కేంద్రంలో తల్లిదండ్రులు త్రాగునీరు కు ఇబ్బంది, పడకుండా తాగునీరు అందించిన గురుకుల పాఠశాల యజ మన్యం

త్రాగునీటి సమస్య లేకుండా చేసిన ప్రిన్సిపాల్ కు ప్రజా రిపబ్లిక్ పేపర్ యజమానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన పరీక్ష రాయడానికి తీసుకువచ్చిన తల్లిదండ్రులు,

కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని జగన్నాథం గట్టు ప్రాంతంలో ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం రోజు 8,9,10వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు పెద్ద ఎత్తున హాజరయ్యే పరీక్ష రాయడానికి తీసుకువచ్చిన తల్లిదండ్రులు నీటి కోసం ఇబ్బందులు పడకుండా మరియు కొండ ప్రాంతంలో ఉన్న ఈ పరీక్ష కేంద్రంలో తల్లిదండ్రులు తాగడానికి నీటి సౌకర్యం కల్పించినందుకు జగన్నాథం గట్టు పైఅంబేద్కర్,గురుకుల పాఠశాల యజమాన్యంపరీక్ష రాయడానికి వచ్చిన పిల్లల తల్లిదండ్రులకు నీటి సౌకర్యం కల్పించినందుకు అలాగేఈ ప్రజాశక్తి పబ్లిక్ పేపర్లో వార్త కు స్పందించి అధికారులు ప్రిన్సిపల్ నీటి సమస్య లేకుండా చేసినందుకు పరీక్ష రాపించడానికి వచ్చిన తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు



# శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన - గడికోట శ్రీకాంత్ రెడ్డి

**- శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకొంటూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థన..**

**- గ్రామాల్లో దేవాలయాలు భక్తి, సంస్కృతి, సామాజిక ఐక్యతకు ప్రతీకలు..**

**ఏపీ బ్యూరో, మార్చి 08 - (రిపబ్లిక్ న్యూస్) -**

మదనపల్లి :- స్థానిక నియోజకవర్గ పరిధిలోని గాలివీడు మండల కేంద్రమైన పందికుంట గ్రామ పంచాయితీ వెంకటాపురం గ్రామంలో గ్రామస్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రారంభ మహోత్సవం కార్యక్రమం ఆదివారం వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య వివిధ పూజ, హోమాది కార్యక్రమాల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామస్తుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా వైయస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా పలు పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఎంతో భక్తి శ్రద్ధగా నియమనిష్టలతో శ్రీకాంత్ రెడ్డి వివిధ పూజా, హోమాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

తొలుత గ్రామంలోకి విచ్చేసిన గడికోట శ్రీకాంత్ రెడ్డిని గ్రామస్తులు, వైసీపీ శ్రేణులు హారాలతో, గజమాలతో పూలవర్షం కురిపిస్తూ కని విని ఎరుగని రీతిలో స్వాగతం పలికారు. గ్రామస్తులకు అభివాదం చేస్తూ గ్రామ పెద్దలను ఆత్మీయంగా పలకరిస్తూ ఆలయం వరకు కాలిబాట చేపట్టారు. ఆలయం వద్దకు విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డిని వేద పండితులు పూర్ణకుంభాలతో వేద మంత్రోచ్ఛారణ లతో స్వాగతం పలికారు. తదనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. వేద మంత్రాల నడుమ పూజా కార్యక్రమాలు చేపట్టి వేద పండితుల ఆశీర్వచనం స్వీకరించారు. హోమాధి కార్యక్రమంలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వైసీపీ శ్రేణులు, గ్రామస్తులు శ్రీకాంత్ రెడ్డి కి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతన్నలు పండించిన పంటలు చేతికొచ్చి వారిని లాభసాటిగా నడపాలని ఆకాంక్షించారు. స్వామి వారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడు ప్రజలందరిపై ఉండాలని ఆయురారోగ్యాలు



అష్ట ఐశ్వర్యాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో దేవాలయాలు భక్తి, సంస్కృతి, సామాజిక ఐక్యతకు ప్రతీకలని ఆయన పేర్కొన్నారు.

**ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడంలో శ్రీకాంత్ రెడ్డి ఎనలేని కృషి..**

పందికుంట గ్రామం వెంకటాపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షల సీజీఎఫ్ నిధుల మంజూరుకు గత వైసీపీ ప్రభుత్వంలో వైయస్ జగన్ సహకారంతో అప్పటి శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్ రెడ్డి చేసిన కృషి ఫలితమేనని గ్రామస్తులు అభినందనలతో ముంచెత్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు ఇవ్వడం అభినందనీయమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా గాలివీడులోని రామాలయ రాజగోపురం మరియు ప్రహరీ నిర్మాణానికి రూ.80 లక్షలు, గోరాన్ చెరువులో శ్రీ అసర్ల గంగమ్మ ఆలయ నిర్మాణానికి రూ.24 లక్షలు గత వైసీపీ ప్రభుత్వం లోనే మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంకా శ్రీవాణి ట్రస్ట్ ద్వారా గాలివీడు మండలంలోని 12 ఆలయాలకు రూ.1.20 కోట్ల నిధులు అందేలా చర్యలు తీసుకున్నారని, మొత్తం ఆలయాల అభివృద్ధికి కలిపి రూ.2.74 కోట్ల నిధులు మంజూరు చేయించారని ఈ సందర్భంగా ప్రజలు గుర్తుచేసుకున్నారు. గ్రామాల ఆధ్యాత్మిక అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను భక్తులు, గ్రామస్తులు కొనియాడుతూ శ్రీకాంత్ రెడ్డిని ఘనంగా సత్కరించారు..

# మహిళగా పుట్టినందుకు గర్వపడాలి

**పిల్లల విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి - జిల్లాలో 83 బాల్య వివాహాలను అడ్డుకున్నాం**

**1.62 లక్షల మహిళలకు రూ.2201 కోట్ల ఆర్థిక సహాయం -అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 8)**

మహిళగా పుట్టినందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వేదికపై నిలబడటానికి కారణమైన తన తల్లితో పాటు అక్కడ ఉన్న మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయని, గత ఎనిమిది నెలల్లో 83 బాల్య వివాహాలను అడ్డుకున్నామని తెలిపారు. ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబమంతా అభివృద్ధి చెందుతుందని, మహిళలలో అపారమైన శక్తి ఉందన్నారు.

ప్రతి బిడ్డకు తల్లే మొదటి దైవమని పేర్కొన్న కలెక్టర్, ఆడపిల్లలను బాగా చదివించి వారు తమ కాళ్ల మీద నిలబడే వరకు పెళ్లిళ్లు చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే కొడుకులకు ఆడపిల్లలను గౌరవించడం నేర్పించాలని కోరారు.

మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజ్ కింద సుమారు 1.30 లక్షల మంది మహిళలకు రూ.1200 కోట్ల చెక్కులను పంపిణీ చేశామన్నారు. స్త్రీనిధి కింద 25,341 మంది మహిళలకు రూ.195 కోట్ల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ఉన్నతి, పీఎం అజయ్ పథకాల కింద 208 స్వయం సహాయక బృందాలకు రూ.176 కోట్ల మద్దతు అందిందన్నారు. ఉన్నతి పథకం కింద 1,698 మంది మహిళలకు రూ.8.5 కోట్ల సాయం అందించామని పేర్కొన్నారు.

ఇతర పథకాలైన సీఐఎఫ్, వీఎజీఎఫ్, వీఆర్ఎఫ్, పీఎంఈజీపీ ద్వారా కూడా వేలాది మంది మహిళలకు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మెప్మా ద్వారా 4,502 స్వయం సహాయక బృంద సభ్యులకు రూ.613 కోట్ల ఆర్థిక సహాయం అందుతోందన్నారు. మొత్తం మీద జిల్లాలో 1,62,782 మంది మహిళలకు సుమారు రూ.2200 కోట్ల ఆర్థిక సహాయం అందుతోందని తెలిపారు.



విద్యకు ప్రాధాన్యం ఇస్తూ అక్షరాస్యత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో అక్షరాస్యత శాతం 57 శాతమే ఉందని, దీనిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'అక్షరాంధ్ర' కార్యక్రమంలో జిల్లాలో 1,61,000 మంది మహిళలు, వృద్ధులు నమోదు చేసుకున్నారని చెప్పారు. రెండు నెలల పాటు నిర్వహించిన శిక్షణలో ఇటీవల జరిగిన ప్రీ ఫైనల్ పరీక్షలో 94 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

అలాగే తల్లిదండ్రులు పనుల కోసం వలస వెళ్లేటప్పుడు పిల్లలను వెంట తీసుకెళ్లకుండా సీజనల్ హాస్టళ్లలో ఉంచి చదివించాలని కోరారు. జిల్లాలో ఇప్పటికే 78 సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేసి 4 వేల మంది పిల్లలకు విద్య అందిస్తున్నామని చెప్పారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదని, స్త్రీలను గౌరవించే సమాజమే అభివృద్ధి చెందుతుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన డ్వాక్రా ఉద్యమం మహిళల ఆర్థిక సాధికారతకు ఎంతో






దోహదపడిందని తెలిపారు. ప్రస్తుతం మహిళలు పొదుపు చేసి వ్యాపారాలు చేస్తూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తున్నారని చెప్పారు.

జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ విశేష ప్రతిభ కనబరుస్తున్నారని, సమాన అవకాశాలు కల్పిస్తే దేశ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారని అన్నారుఅనంతరం డీఆర్‌డిఏ, మెప్మా ఆధ్వర్యంలో వివిధ పథకాల కింద లబ్ధిదారులైన సుమారు 1.62 లక్షల మంది మహిళలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2,201 కోట్ల ఆర్థిక సహాయాన్ని చెక్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా మహిళా పారిశ్రామికవేత్తలు, మహిళా అధికారులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, డీఆర్ఓ సి. వెంకటనారాయణమ్మ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ సావిత్రి, వడ్డెర సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చంద్రిక, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవ లక్ష్మీ, బొందిల్ల కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, ఓర్వకల్లు పొదుపు ఐక్య సంఘం అధినేత విజయ భారతి, డీఆర్‌డిఏ పీడీ రమణారెడ్డి, జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888
సోమవారం 9 మార్చి 2026

## డోన్,పాతపేట కటిక వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



**బేతంచర్ల ప్రతినిధి, మార్చి 08,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఆదివారం రోజున,మన రాష్ట్ర మాజీ మంత్రిబుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇటీవల పాతపేటలో మరణించిన కటిక వెంకటేష్ నివాసానికి వెళ్ళి వారి కుటుంబాన్ని పరామర్శించారు.పార్టీ వారి కుటుంబానికి అన్ని విధాలుగా తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు.వారితో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు,ఎంపీపీ రేగటి రాజశేఖర్,మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, మండల అధ్యక్షులు సోమేష్ యాదవ్ ,పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి,మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామచంద్రుడు,పార్టీ నాయకులు ఆర్.ఇ రాజవర్ధన్,కటిక వేణు,మహేశ్వర రెడ్డి, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**బేతంచెర్ల పరిధినిది, మార్చి 08,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఆదివారం రోజున,మహిళా అంటే నిత్య చైతన్య స్ఫూర్తిమహిళా అంటే ఆది పరాశక్తి ఒకతల్లిగా,చెల్లిగా,సతీమణిగా,వైద్యురాలిగా, ఇంజినీర్ గా,అధికారిణిగా,సర్పంచుగా ఇలా విభిన్న కోణాలలో రాణిస్తూ ఒక అజేయశక్తిగా అద్భుతాలు సృష్టిస్తున్నారు ఈ మహిళామణులు!
మహిళా అంటే త్యాగనీరతికి, సేవాగుణానికి ఒక పర్యాయ పదంఒకప్పుడు మహిళా అంటే ఇంటికే పరిమితమయ్యే ఇల్లాలుకాని నేడు మహిళలు దేశ విదేశాలకు వెళ్లి విద్య ను అభ్యసిస్తూ తన ఉనికిని చాలాబాగాచాటుకుంటున్నారు,ముఖ్యంగా ఈ సమాజంలో తమకు ఎదురయ్యే అనేక సమస్యలపై తమదైన శైలిలో ఒక ఝాన్సీ లక్ష్మీబాయి లా, ఒక రుద్రమదేవిలా,ఒక వీరవనితలా ఉద్యమిస్తున్నారు ఈ రోజు మహిళలకు అన్ని విషయాలలో వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి మహిళా సంఘాలుపురుషులతో పోలిస్తే తామేమి తక్కువ కాదు అన్న రీతిలో ఒకపారిశ్రామికవేత్తలుగా,లాయర్,లుగారాజకీయవేత్తలుగా మానవ హక్కుల సంఘాలకు అధ్యక్షులుగా,ఉపాధ్యాయురాలుగా, వైద్యురాలుగా పైలట్లుగా,వివిధ వాహనాలకు డ్రైవర్లుగా,హాస్పిటల్ రంగంలో నర్సులుగా,సాఫ్ట్ వేర్ఇంజినీర్లుగా,మిలిటరీ,నావిక,రక్షణ రంగాలలో సైతం తమ దైన ముద్రను చాలా బలంగా వేస్తున్నారు ఈ మహిళామణులు!
స్వాతంత్ర్య సంగ్రామంలో ఝాన్సీ లక్ష్మీ బాయి, రుద్రమదేవి,రాజకీయ రంగంలో స్వర్గీయ సరోజినీదేవి,ఇందిరాగాంధీ,జయలలిత,సుష్మ స్వరాజ్, మీరాకుమార్,మేనకగాంధీ,సోనియా గాంధీ,మమతా బెనర్జీ,నిర్మలా సీతారామన్,సేవా రంగంలో మదర్ థేరిస్సా,చలన చిత్ర రంగంలో అలనాటి తరాలు నర్గీస్,సావిత్రి,అంజలీదేవి,భానుమతి రామకృష్ణ, విజయనిర్మల,బ్యాట్ మింటన్ రంగంలో పి.వి.సింధు, సైనా నెహ్వాల్,కోనేరు హంపి,క్రికెట్ రంగంలో మితాలిరాజ్,స్మృతి మంధాన,వెయిట్ లిఫ్టింగ్ రంగం లో వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి,అథ్లెటిక్స్ లో పి. టీ. ఉష,సంగీత రంగం లో ఎం.యస్.సుబ్బలక్ష్మి,సినీ పాటల రంగంలో లతా మంగేష్కర్,ఎస్.జానకి, సుశీల, పోలీస్ డిపార్టుమెంట్ లో కిరణ్ బేడీ వీరంతా తమ రంగాలలో తమదైన శైలిలో విశిష్ట సేవలు అందించి ఒక గొప్ప చరిత్ర సృష్టించినవారే.ఏదిఏమైనా మహిళ అంటే అబల కాదు,సబలా అని నిరూపిస్తూ,మహిళ అంటే ఇంటికే పరిమితం కాదు అని బయట ప్రపంచంలో సైతం తమ సత్తా చాటే ధైర్య సాహసాలు,ప్రతిభా సామర్థ్యాలు మా సొంతం అని చాలా గొప్పగా చాటి చెబుతున్న మహిళశక్తి స్వరూపిణిలందరికి,యావత్తు మహిళా లోకానికే ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక్కసారి మనమంతా వారికి శతకోటి వందనాలు తెలియజేద్దాం.జయ జయహో మహిళలోకం! జయ జయహో స్త్రీ శక్తి అని తెలిపారు

# మదనపల్లి వీధుల్లో 'మహిళా చైతన్యం'..

**- వాకథాన్‌లో తోటి మహిళలతో అడుగులేసిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి..**

**- ఆడబిడ్డల రక్షణ కోసం పోలీసులు నిరంతరం పహారా..**

**- ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే ఏ శక్తినైనా అణిచివేసేందుకు అన్నమయ్య జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధం..**










**ఏపీ బ్యూరో, మార్చి 08 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణంలో ఆదివారం నిర్వహించిన 'మహిళా వాకథాన్' వేడుకలు అంబరాన్నంటాయి. మహిళా శక్తిని చాటేలా, వారి భద్రత పట్ల అవగాహన కల్పించేలా నిర్వహించిన ఈ భారీ ర్యాలీ ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమానికి మహిళా మణుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ పాల్గొని మిషన్ కాంపౌండ్ వద్ద జెండా ఊపి భారీ ర్యాలీని ప్రారంభించారు. మహిళలతో కలిసి అడుగులేసిన ఎస్పీ కేవలం జెండా ఊపి వాకథాన్ ను ప్రారంభించడమే కాకుండా స్వయంగా ఎస్పీ మహిళా పోలీసు సిబ్బంది, విద్యార్థినులు మరియు స్థానిక మహిళలతో కలిసి సుమారు 2 కిలోమీటర్ల మేర నడిచి వారిలో ఉత్తేజాన్ని నింపారు. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ వాకథాన్‌లో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మహిళల సమస్యలను అడిగి తెలుసుకుంటూ వారికి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. మహిళల నినాదాలతో మదనపల్లి వీధులు మార్మోగాయి. మహిళలను ఏడిపిస్తున్న ఆకతాయిలను ఎలా ఎదుర్కోవాలో కొందరు విద్యార్థినీ విద్యార్థులు చేసిన నాటక ప్రదర్శన ఎంత గానో ఆకట్టుకుంది.

**మహిళా భద్రత మా ప్రథమ కర్తవ్యం..**
ర్యాలీ అనంతరం బి.టి. కళాశాల పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ఎస్పీ ప్రసంగిస్తూ సమాజంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని అందులో భాగంగానే పోలీసు శాఖ నిరంతరం పని చేస్తోందని తెలిపారు. "మహిళలకు ఎక్కడైనా, ఏ సమయంలోనైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి. "నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే ఏ శక్తినైనా అణిచివేసేందుకు అన్నమయ్య జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. శక్తి టీమ్స్, శక్తి యాప్ మరియు 112 నంబర్ సేవలను ప్రతి మహిళా వినియోగించుకోవాలి. మీ రక్షణ కోసం మేము నిరంతరం పహారా కాస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

**విజేతలకు ప్రోత్సాహం..**
ఈ వాకథాన్‌లో ఎంతో చురుగ్గా పాల్గొని లక్ష్యాన్ని చేరుకున్న మహిళలలో 10 మందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వారికి జ్ఞాపికలను, బహుమతులను అందజేస్తూ, వారిలోని స్ఫూర్తిని గుర్తించి కొనియాడారు. బహుమతులు అందుకున్న వారిలో విద్యార్థినులతో పాటు గృహిణులు కూడా ఉండటం విశేషం. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) వెంకటాద్రి, పలువురు సీఐలు, ఆర్.ఐలు, ఎస్.ఐలు, ఆర్.ఎస్.ఐలు, పెద్ద సంఖ్యలో మహిళలు పోలీసులు మరియు పట్టణ వాసులు పాల్గొన్నారు..

## న్యాయ సేవా సదన్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తే దేశం పురోగతి సాధిస్తుందని న్యాయమూర్తుల అభిప్రాయం**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 8)**జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జి. కబర్థి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో గల న్యాయ సేవా సదన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పి. కమలాదేవి, ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి లక్ష్మి రాజ్యం, సీబీఐ కోర్టు జడ్జి శోభారాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ, మొబైల్ కోర్టు జడ్జి అనూషలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా జడ్జి పి. కమలాదేవి మాట్లాడుతూ మహిళా దినోత్సవ విశిష్టతను వివరించారు. నేటి సమాజంలో జరుగుతున్న అనేక అరాచకాల నేపథ్యంలో మహిళలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు.నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మరియు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచనల మేరకు నిర్వహిస్తున్న "వందరోజుల బాల్య వివాహ రహిత భారత్" కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా జిల్లాలోని 160 గ్రామాలలో సదస్సులు నిర్వహించి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ క్రమంలో బి.అగ్రహారం, సంతెకుడ్లూరు, లింగంపల్లి గ్రామాల్లో జరుగుతున్న బాల్య వివాహాలను సకాలంలో అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.అనంతరం మహిళా న్యాయమూర్తులు కమలాదేవి, లక్ష్మి రాజ్యం, శోభారాణి, సరోజనమ్మ, అనూషలను లీగల్ సర్వీసెస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నిర్మల, యూ.వి. లక్ష్మి, ఇందుమతి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సులోచన, బచ్పన్ బచావో ఆందోళన్ ఎన్జీవో ప్రతినిధి మౌనిక, డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, మహిళా ప్యానెల్ న్యాయవాదులు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు, కోర్టుల మహిళా సిబ్బంది, ప్యారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# కల్లూరులో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**మెగా ఉచిత వైద్య శిబిరం**

**మహిళా ప్రముఖులకు సత్కారం ప్రజలు, జర్నలిస్టులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు**








**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 8)**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్లూరులోని ఆదిత్య పాఠశాలలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యుజెఎఫ్) గౌరవాధ్యక్షులు పి. యూసుఫ్ ఖాన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం జిల్లా కమిటీ, తెలకపల్లి నరసింహయ్య గ్రంథాలయం, కల్లూరు ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్, జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) జిల్లా కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. కర్నూలు జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కె.జి. గంగాధర్ రెడ్డి, ఆదిత్య విద్యానిలయం కరస్పాండెంట్ వాసుదేవయ్య, భారత చైతన్య యోజన పార్టీ రాష్ట్ర ఈసీ సభ్యులు వరుణ్ కుమార్ యాదవ్‌ల సహకారంతో మెడికవర్, శాంతిరామ్, శ్రీ వెంకట సాయి రాయల్ డెంటల్ క్లినిక్‌ల సౌజన్యంతో వైద్య శిబిరం జరిగింది.
ఈ శిబిరానికి కల్లూరు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, అడ్వకేట్ సౌభాగ్యధరణి, ఐద్వా నాయకురాలు కిరణ్మయి, 'రుదిరోద్గారి' పత్రిక ఎడిటర్ ఆకేపోగు చిన్ని తదితరులు హాజరయ్యారు. మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం ప్రజలకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ విభాగంలో డాక్టర్ సబా (ఎంబిబిఎస్), ఏజీఎం ఎస్. ఖాదర్ బాషా, జీఎం వై. మోహన్ రెడ్డి సేవలు అందించారు.
చల్లావారి వీధిలోని వెంకట సాయి రాయల్ డెంటల్ క్లినిక్ తరఫున డాక్టర్ సాయి పంకజ్ దాదాపు 25 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. అలాగే దేవనగర్ బ్రాంచ్ శాంతిరామ్ ఐ హాస్పిటల్ నుంచి పీసీఏ మధు, ఆప్టాల్మాలజిస్ట్ వెంకటరామన్ సిబ్బందితో కలిసి ఉచిత కంటి పరీక్షలు చేశారు. కంటి పరీక్షల అనంతరం కళ్లద్దాలు అవసరమైన వారికి ఉచితంగా అందించేందుకు కర్నూలు జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కె.జి. గంగాధర్ రెడ్డి దాతగా సహకారం అందించారు.స్థానిక కల్లూరు ప్రాంతానికి చెందిన ప్రజలు, విలేకరులు సుమారు 200 మంది ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా యుజెఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు నీలం సత్యనారాయణ, జాప్ జిల్లా కమిటీ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి సహకరించిన విలేకరులు, ఆదిత్య స్కూల్ కరస్పాండెంట్ వాసుదేవయ్య, సిబ్బంది, ఆసుపత్రి ప్రతినిధులు, మాజీ గ్రంథాలయ చైర్మన్ కె.జి. గంగాధర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల త్యాగం అపారమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఆడ, మగ అనే వివక్ష లేకుండా పిల్లలను సమానంగా పెంచాలని సూచించారు. అనంతరం మహిళా ప్రముఖులను ఘనంగా సత్కరించారు.
ఈ కార్యక్రమంలో యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు నీలం సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు గిలిగిత్త విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి ఉమ్మల్ల రాజశేఖర్, జిల్లా నాయకులు దండు విద్యాసాగర్, విజయ్ కుమార్, పి. నాగేంద్రుడు, మల్లికార్జున, వై. వెంకటేశ్వర రెడ్డి, మధుసూదన్, మధు, చంద్రశేఖర్, శ్యాం, దేవరాజ్, తెలకపల్లి నరసింహయ్య గ్రంథాలయం కమిటీ అధ్యక్షుడు కె. ప్రభాకర్, కార్యదర్శి దనేష్, ఉపాధ్యక్షుడు అజాద్, సభ్యులు సికిందర్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**మహిళల జీవనోపాదులు**
**పెంపొందించేందుకు అనేక పథకాలు అమలు**
**వాటిపై విస్తృతంగా అవగాహన కల్పించాలి**
**ప్రతి మహిళా సద్వినియోగం చేసుకునేలా చూడాలి**
**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**
**మహిళా సాధికారతకు తమ కూటమి కట్టుబడి ఉంది**
**అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్**



**అనంతపురం సంక్షేమం, మార్చి 08,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం నగరంలోని జేఎన్టీయూలో ఉన్న నందమూరి తారక రామారావు (ఎన్టీయార్) ఆడిటోరియంలో ఆదివారం జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించగా, ఇందులో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, జెఎన్టీయూ విసి హెచ్.సుదర్శన రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, వీర శైవ లింగాయత్ వెల్ఫేర్ డెవలప్మెంట్ ఛైర్మన్ స్వప్న, అనంతపురం మార్కెట్ యార్డు ఛైర్ పర్సన్ బల్లాపల్లవి, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను అధికారుల పరిశీలన**

ముందుగా ఎన్టీఆర్ ఆడిటోరియంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, డిఆర్డీఏ, మెప్మా, పోలీస్, తదితర శాఖల వారు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, జెఎన్టీయూ విసి, తదితరులు పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్డీఏ, ఐసిడిఎస్, మెప్మా ఆధ్వర్యంలో మహిళల అభివృద్ధి, జీవనోపాధుల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాల వివరాలను ఆయా శాఖల పిడిలు వివరించారు.

**టీనేజ్ ప్రెగ్నెన్సీ వారు ఉండడం దురదృష్టకర అంశం**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ ముందుగా మహిళామణులు అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో డిఆర్డీఏ, మెప్మా, మహిళా శిశు సంక్షేమ శాఖ, తదితర శాఖలు మహిళలకు జీవనోపాదులు పెంపొందించు కునేందుకు అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తున్నారని, వాటిపై విస్తృత అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఒక్కరూ చూడాలన్నారు. పీఎంఈజిపి మరియు పీఎంఎఫ్ఎంఈ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి చాలా మందికి అవగాహన తక్కువగా ఉందని, మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆయా శాఖల అధికారులు మీ వార్డుల్లో మరియు గ్రామాల్లో ఈ పథకాలపై అవగాహన పెంచాలన్నారు. మహిళలు స్వయంగా సంపాదించుకోగలిగితే, వారి జీవితాలను మెరుగ్గా తీర్చిదిద్దుకోగలరన్నారు. మన జిల్లాలో సుమారు 4,250 మంది దాకా చిన్న వయసులో పెళ్లి చేసుకుని టీనేజ్ ప్రెగ్నెన్సీ కలిగిన వారు ఉండడం ఒక దురదృష్టకర అంశం అని పేర్కొన్నారు. మనం అందరం అన్ని ఫోరమ్ లలో ఈ అంశాలపై చర్చించి అవగాహన కల్పించి మన జిల్లాలో బాల్య వివాహాల నివారణకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలోనూ దీనిపై అవగాహన ఉండాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే, మీరందరూ ముందుండి వాటిని ఆపాలని, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ సందేశాన్ని



మీ ఊర్లో అందరికీ తెలియజేస్తారని ఆశిస్తున్నానన్నారు.

**ఎస్సీ, ఎస్టీ మహిళలకు షూరిటీ లేకుండా ఉచిత రుణాలు**

ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు గారిదేనని గుర్తుచేశారు. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా దాదాపు కోట్లాది మంది మహిళలు లబ్ధి పొందారని, తల్లికి వందనం పథకం కింద సుమారు 67 లక్షల మంది విద్యార్థుల తల్లులకు ఒక్కొక్కరికి 15,000 రూపాయల చొప్పున మొత్తం 10 వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం అందజేసిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కళ్యాణలక్ష్మి మరియు యానిమేటర్లకు ఉచిత స్మార్ట్ ఫోన్ల పంపిణీ వంటి కొత్త పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో మహిళలపై, చిన్న పిల్లలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, నిందితులపై త్వరితగతిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్థిక తోడ్పాటు అందించడంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఎలాంటి షూరిటీ లేకుండా ఉచిత రుణాలు, అలాగే ఇతర మహిళలకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో అనంతపురంలో మహిళల కోసం ప్రత్యేకంగా టెక్స్‌టైల్ పార్క్ మరియు ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు.

**తల్లిని పూజిద్దాం, భార్యను ప్రేమిద్దాం, స్త్రీని గౌరవిద్దాం"**

ఈ సందర్భంగా ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో మహిళలకు గౌరవం ఇచ్చిందని, మన దేశంలో మహిళలను గుర్తించే గొప్ప సంప్రదాయం ఉందన్నారు. ఇందుకు ఆది దంపతులు స్ఫూర్తి అని, శివపార్వతులు, సీతారాములు, అలివేలుమంగ వెంకటేశ్వరులు, కనకదుర్గమ్మ, భ్రమరాంబ మల్లికార్జున స్వామి వంటి దైవ స్వరూపాల్లో స్త్రీని గౌరవించే ఆచారం మన భూమిలో ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు మహిళా సాధికారతకు డ్వాక్రా సంఘాల ఏర్పాటుతో బలమైన పునాది వేశారన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, ఆస్తి హక్కు వంటి విప్లవాత్మక నిర్ణయాలను ఆయనే ప్రవేశపెట్టారన్నారు. 25 ఏళ్ల క్రితం ఒక చిన్న మొక్కలా ప్రారంభమైన 'డ్వాక్రా వెలుగు సంఘాలు' ఈరోజు అనంతపురం జిల్లాలో మర్రి వృక్షంలా విస్తరించి ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయన్నారు. ఒకప్పుడు బ్యాంకుల వద్ద లోన్ల కోసం ఇబ్బంది పడిన మహిళలు, ఈరోజు తమ స్వశక్తితో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని, ప్రస్తుత ప్రభుత్వం కూడా రైతు సంఘాల ద్వారా మహిళలను మరింత ప్రోత్సహిస్తోందన్నారు. మహిళలకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత ఉండాలని యువ నాయకత్వం ఆకాంక్షిస్తోందని, రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో మరియు రాష్ట్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనేది సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ బాబు గారి విజన్ అని అన్నారు. దేశ రాష్ట్రపతి మహిళా కావడం, మన రాష్ట్ర హోం మంత్రి మహిళా కావడం మహిళలకు ఇస్తున్న గౌరవానికి నిదర్శనమన్నారు. మహిళ ఎదిగితే విజయం, మహిళ పక్కనుంటే జీవితం, మహిళ ముందుంటే ఉద్యమం, తల్లిని పూజిద్దాం, భార్యను ప్రేమిద్దాం, స్త్రీని గౌరవిద్దాం" అని పిలుపునిచ్చారు.



**మహిళలు మొదటి స్థానంలో ఉండేలా ముఖ్యమంత్రి చొరవ**

ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, వీర శైవ లింగాయత్ వెల్ఫేర్ డెవలప్మెంట్ ఛైర్మన్ స్వప్న, అనంతపురం మార్కెట్ యార్డు ఛైర్ పర్సన్ బల్లాపల్లవి, తదితరులు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రికి, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజరంగంలోనూ మహిళలు మొదటి స్థానంలో ఉండేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు ఎన్నో అవకాశాలు, గుర్తింపు కల్పిస్తున్నారన్నారు.

**సాంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి**

ఈ సందర్భంగా పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు వారి విజయగాథలను తెలిపి, తమను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. నగరానికి చెందిన ప్రభుత్వ పాఠశాల, కాలేజీ విద్యార్థినీలు, శ్రీకాంత్ అకాడమీ, యోగనంద, టెక్నో అకాడమీకి చెందిన చిన్నారులు చేసిన కరాటే ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. మహిళా సంఘాల సభ్యులను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు సన్మానించారు.

**మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజ్ మెగా చెక్**

ఈ సందర్భంగా డిఆర్డీఏ ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజ్ కి సంబంధించిన 1,301.27 కోట్ల మెగా చెక్ ను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. డిఆర్డీఏ పరిధిలో స్త్రీ నిధి, ఉన్నతి, సిఐఎఫ్ లకు సంబంధించిన 234.96 కోట్ల రూపాయల మెగా చెక్కును, పీఎంఏజెఏవై కింద 2.52 కోట్ల రూపాయల చెక్ ను సభ్యులకు అందించారు. మెప్మా పరిధిలో 490.37 కోట్ల మెగా చెక్ ను, ర్యాపిడో వెహికల్స్ 6





వాహనాలను పంపిణీ చేశారు. జిఎం డిఐసి, ఎల్డీఎం ఆధ్వర్యంలో పీఎంఈజీపి, పీఎంఎఫ్ఎంఈ, ముద్ర, పియం విశ్వకర్మ పథకాలకు సంబంధించి 15.33 కోట్ల రూపాయల మెగా చెక్ ను పారిశ్రామికవేత్తలకు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు అందజేశారు. అనంతరం ఆయా శాఖల అధికారులను సన్మానించారు.

**వివిధ ఉన్నతాధికారులు, డైరెక్టర్లు, చైర్మన్లు**

ఈ కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనరసింహమూర్తి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న, రజిత కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, డిఆర్డీఏ పిడి శైలజ, మెప్మా పిడి విశ్వజ్యోతి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, హౌసింగ్ పిడి శైలజ, డిసిఓ అరుణకుమారి, జిల్లా హార్టికల్చర్ అధికారి ఉమాదేవి, ఎల్డిఎం నరేష్ రెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ప్రతాపరెడ్డి, చేనేత జౌళి శాఖ ఎడి వరప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి రవి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, డిఎస్డిఓ మంజుల, బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి సుభాషిణి, హ్యాండ్లూమ్స్ అభివృద్ధి అధికారి బసవరాజు, ఆయా శాఖల అధికారులు, డిఆర్డీఏ, మెప్మా, స్వయం సహాయక సంఘం సభ్యులు, మహిళా పారిశ్రామికవేత్తలు, పెద్దఎత్తున మహిళలు, విద్యార్థినీవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.









## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన కాటసాని ఉమామహేశ్వరమ్మ



**కల్లూరు ప్రతినిధి, మార్చి 08,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఆదివారం రోజున,కర్నూలు నగరంలో జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి నివాసంలో ఎస్వీ విజయ మనోహరి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ ఈ సందర్భంగా కాటసాని ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ, మహిళలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా కీలక శక్తిగా నిలుస్తున్నారని లో అన్నారు. ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను నిరూపిస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. మహిళల సాధికారతతోనే సమాజం మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.మహిళల హక్కులు, గౌరవం మరియు సమాన అవకాశాలు కల్పించడంలో అందరూ కలిసి పని చేయాలని కాటసాని ఉమామహేశ్వరమ్మ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి,డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక,కర్నూలు నగరంలోని మహిళా నేతలు, వైసిపి మహిళ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు

## బళ్లారి పాఠశాలలో తోటి విద్యార్థులపై ఇనుప రాడ్డుతో దాడి..

**కర్నూలు జిల్లా విద్యార్థి మృతి**

**రాత్రి పడుకున్న సమయంలో దాడి చేసిన విద్యార్థి**

**ఒకరి మృతి, ఏడుగురికి గాయాలు**

**పరారీలో దాడి చేసిన విద్యార్థి**



కర్ణాటకలోని బళ్లారి జిల్లాలో ఓ పాఠశాల హాస్టల్‌లో ఓ విద్యార్థి దారుణానికి పాల్పడ్డాడు. పడుకున్న తోటి విద్యార్థులపై ఇనుప రాడ్డుతో దాడి చేయగా ఒకరు మృతి చెందారు. మరో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన చిన్న వివాదం ఒక విద్యార్థి ప్రాణం తీసే వరకు వచ్చింది. దాడి చేసిన విద్యార్థి పరారీలో ఉన్నాడు.హాస్టల్‌లోని తోటి విద్యార్థులపై ఇనుప రాడ్డుతో దాడి చేశాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో మరణించిన విద్యార్థి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన బాలుడిగా గుర్తించారు. విషయం తెలియగానే జిల్లా పోలీసు అధికారి డాక్టర్ డి సుమన్ పెన్నేకర్ పాఠశాలను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు.

# అక్క చెల్లెమ్మలకు "బ్రాండెడ్ నారాయణ" ఉచితంగా చీరలు పంపిణీ

**25 మంది ఆటోలు నడిపే మహిళలకు అందజేత -ఒక్కో చీర ధర రూ.4 వేల రూపాయలు**

**మంచి మనసున్న వ్యక్తి " బ్రాండెడ్ నారాయణ" -సేవా కార్యక్రమాలలో మహిళలకు మొదటి ప్రాధాన్యత**





**అనంతపురం ప్రతినిధి, మార్చి 08,(రిపబ్లిక్ న్యూస్):**
"బ్రాండెడ్ నారాయణ" మంచి మనసున్న వ్యక్తి. ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన గొప్ప వ్యక్త ఆయన. వివిధ సేవా కార్యక్రమంలో మొట్టమొదటగా మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తారు. ఏ కార్యక్రమమైనా తన సొంత డబ్బును ఖర్చు చేసి వేల మంది మహిళలకు ఉచిత సామూహిక సీమంతాలు చేపట్టిన వ్యక్తి ఉన్నారు అంటే అది ఒక్క "బ్రాండెడ్ నారాయణ" అనే చెప్పవచ్చు. ఇలా చెప్పుకుంటూ పోతే.. ఆయన చేసిన సేవ కార్యక్రమాలు ఎన్నో . అందులో భాగంగా ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఉచితంగా మహిళలకు ఒక్కో చీరకు రూ.4 వేల రూపాయలను ఖర్చు చేసి 25 మంది మహిళలకు పసుపు, కుంకుమ, ఆకు ఒక్క గాజులతో కలిపి ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. అంటే ఆయనకు మహిళలపై ఆయనకు ఉన్న గౌరవం ఇట్టే అర్థం చేసుకోవచ్చు. మనుషుల్లో దేవుళ్ళు ఉంటారు అనేదానికి "శ్రీ లక్ష్మీ శారీ సెంటర్ అధినేతలు లక్ష్మీదేవి, బ్రాండెడ్ నారాయణ" లే ప్రత్యక్ష సాక్షం.

### భార్య లక్ష్మీదేవి స్ఫూర్తితోనే ఈ స్థాయిలో ఉన్నా

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నగరంలో ఆటోలు నడిపే అక్క చెల్లెమ్మలకు "బ్రాండెడ్ నారాయణ" ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీలక్ష్మి సారీ సెంటర్ లో అధినేత లక్ష్మీదేవితో కలిసి బ్రాండెడ్ నారాయణ తన మంచి మనసుతో ఆటోలు నడిపే అక్క చెల్లెమ్మల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. 25 మంది అక్క చెల్లెమ్మలకు తన మంచి మనసుతో భార్యతో కలిసి చీరలు పంపిణీ చేశారు. ఒక్కో అక్క చెల్లెమ్మ లకు రూ.4 వేల రూపాయల విలువైన చీరలను హృదయ పూర్వకంగా అందజేసి మహిళలపై ఉన్న గౌరవాన్ని వ్యక్తపరిచారు. శ్రీ లక్ష్మీ శారీ సెంటర్ బ్రాండెడ్ నారాయణ అందజేసిన చీరలను తీసుకున్న మహిళలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆటోలు నడిపే మమ్మల్ని (మహిళలను) గుర్తించి ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా బ్రాండెడ్ నారాయణ చీరలు అందజేయడం నాకు ఎంతో సంతోషంగా, గర్వంగానూ ఉందని తెలిపారు. బ్రాండెడ్ నారాయణ మహిళలను అక్కగా, చెల్లిగా, తోబుట్టువుగా ఉంటూ ఈరోజు మా అందరి మహిళలకు గౌరవంగా మంచి మనసు చాటుకుని ఇలా చీరలు అందజేయడం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం, గౌరవించడం తన వంతు బాధ్యత అని బ్రాండెడ్ నారాయణ తెలిపారు. తన భార్య లక్ష్మీదేవి స్ఫూర్తితోనే ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానని గుర్తు చేశారు.

### అన్ని రంగాలలో మహిళలు పురుషులతో సమానం

ఈ సందర్భంగా బ్రాండెడ్ నారాయణ మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మన సాంప్రదాయమని, ప్రస్తుతం సమాజంలో మహిళలు మగవాళ్లకు దీటుగా ప్రతి రంగంలో రాణిస్తున్నారన్నారు. మహిళలు ఒక శక్తి లాంటివారు ప్రతి వ్యక్తి మహిళలను గౌరవించాలన్నారు. మహిళలకు అద్భుతమైన తెలివి ఆలోచించే విధానం రోజురోజుకు పురోగతి సాధిస్తున్నారన్నారు. సాంఘిక, రాజకీయ రంగాలలో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. జీవితంలో మహిళలు అమ్మ, చెల్లి, అక్క, గురువు, భార్య ఇలా ఎన్నో పాత్రలు పోషిస్తున్న వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# జనసేన పార్టీ నేత కుమార్తెల కన్నీటి ఆర్త నాథం..!

### డిప్యూటీ సీఎం మాకు మీరే న్యాయం చేయాలి..

**ఏపీ బ్యూరో, మార్చి 08 - (రిపబ్లిక్ న్యూస్) -**
'డాడీ నీకు మా పరిస్థితి అర్థం అవుతుందా. అమ్మను వదిలేసి మరో పెళ్లి చేసుకున్నావు. మమ్మల్ని చూసేందుకు వారానికి ఒక్కసారి అయినా రావాలనిపించలేదా. మాకు న్యాయం జరగకపోతే చనిపోవడం తప్ప మరో మార్గం లేదంటూ ఇద్దరు యువతులు విడుదల చేసిన వీడియో ఇప్పుడు ఏపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన జనసేన నేత మల్లాది రాజు కుమార్తెలుగా చెప్పుకుంటున్న ఇద్దరు యువతులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ వీడియో రూపంలో వాళ్ల కన్నీటి గాధను చెప్పుకుంటూ సందేశాన్ని విడుదల చేశారు. తమ తండ్రి తమను, తమ తల్లిని నట్టేట ముంచారని ఆ యువతులు ఆరోపించారు. మల్లాది రాజు తాను నడుపుతున్న ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఒక మహిళను రెండో వివాహం చేసుకున్నారని, అప్పటి నుంచి తమ కష్టాలు మొదలయ్యాయని వారు కన్నీరుమున్నీరయ్యారు.

**తండ్రి వేధింపులు.. తల్లి ఆత్మహత్య**
తండ్రి రెండో పెళ్లి చేసుకోవడంతో తమ తల్లి తీవ్ర మానసిక క్షోభకు గురైందని ఆ సోదరీమణులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కోసం ఆమె కోర్టులు, పోలీస్ స్టేషన్లు, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం




లేకపోయిందని, చివరకు తండ్రి వేధింపుల కారణంగా ఆమె ఆత్మహత్య చేసుకుందని వారు వెల్లడించారు.

**ఇల్లు ఖాళీ చేయాలంటూ వేధింపులు..**
తల్లి మరణం తర్వాత తమను అక్కున చేర్చుకోవాల్సిన తండ్రి, మరింత క్రూరంగా వ్యవహరిస్తున్నారని ఆ యువతులు ఆరోపించారు. ప్రస్తుతం వారు నివసిస్తున్న ఇల్లు తమ తండ్రి పేరు మీద ఉన్నప్పటికీ, తాము దానిని అక్రమంగా కబ్జా చేశామంటూ తమపై కేసులు పెట్టి వేధిస్తున్నారని వారు పేర్కొన్నారు. తమకు అండగా నిలుస్తున్న అమ్మమ్మ, మావయ్యలపై కూడా అక్రమ కేసులు బనాయిస్తూ మానసిక హింసకు గురిచేస్తున్నారని వారు వాపోయారు.

**పవన్ కల్యాణ్ సార్.. మీరే మా చివరి ఆశ..!**
తమకు ఎవరూ లేరని, ఇప్పుడు తమకు ఉన్న ఏకైక ఆశ జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాత్రమేనని ఆ యువతులు వేడుకున్నారు. 'పవన్ సార్ మీరు ఆడబిడ్డల పక్షపాతి అని మాకు తెలుసు. మా తండ్రి వల్ల మాకు ప్రాణహాని ఉంది. ఆయనపై చర్యలు తీసుకుని, మాకు న్యాయం చేయండి. లేదంటే మాకు ఆత్మహత్యే శరణ్యం' అంటూ వారు చేసిన విన్నపం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది..
దిదిదిదిది

# వైసీపీ పాలనలో విచ్చలవిడిగా డ్రగ్స్

### మూడు రాజధానులని ఒక్కటీ లేకుండా చేశారు: షర్మిల



**దేవరపల్లి, మార్చి 08 (రిపబ్లిక్ న్యూస్):** జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో లిక్కర్ మాఫియాతో నాసిరకం మద్యం తయారుచేసి రాష్ట్ర ఆదాయాన్ని తినేశాడని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరులో ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా ఆదివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రానికి కంటైనర్లలో డ్రగ్స్ వచ్చాయని, రాష్ట్రంలో విచ్చలవిడిగా మాదక ద్రవ్యాలు దొరికేలా తయారు చేశారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే మోదీ కాలర్ పట్టుకుని ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన జగన్.. బీజేపీకి సాగిలపడ్డాడని విమర్శించారు. రాష్ట్రానికి మూడు రాజధానులంటూ ఒక్క రాజధాని కూడా లేకుండా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. పోలవరం ఎత్తు తగ్గించి నిర్వీర్యం చేస్తుంటే ఒక్కరు కూడా నోరు మెదపటం లేదన్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్దపీట వేస్తోందని, మహిళలకు రాజకీయ పదవుల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని చెప్పారు. బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అమర్‌జహాబేగ్ మాట్లాడుతూ తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని జగన్‌రెడ్డి ఈ రాష్ట్రాన్ని ఏం ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జేడీ శీలం, బోడా వెంకట్, మార్టిన్ లూథర్, టీకే విశ్వేశ్వరరెడ్డి, గిడుగు రుద్రరాజు, కే.ప్రభాకరరావు, కాకర్ల శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి మత్తులో పెడత్రోవ పడుతున్న యువత.

### సీఐ శ్రీనివాసులు.

**ఓబులవారిపల్లి మార్చి 8 రిపబ్లిక్ న్యూస్.**
సమాజంలో గంజాయి యువత పట్ల శాపంగా మారిందని, ఎంజాయ్ తాగడం వల్ల యువత పెడత్రోవ పడుతున్నదని అది సమాజానికి శ్రేయస్కరం కాదని రైల్వేకోడూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు యువతను హెచ్చరించారు గంజాయి వంటి మాదకద్రవ్యం పట్ల తల్లిదండ్రులు గట్టి శ్రద్ధ వహించాలని పిల్లలు కాలేజీ అనంతరం ఏం చేస్తున్నారు ఎక్కడ తిరుగుతున్నారు వారిని ఒక కంట కనిపెట్టాలని చదువు పట్ల వారిని శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు ఆదివారం

రైల్వే కోడురు, చిట్వేలి ఓబులవారిపల్లి మండలాల్లో వత్తలూరు, చిన్నఓరంపాడు మంగంపేట రైల్వే కోడూరు చిట్వేలి బస్టాండు మరియు తదితర.పంచాయతీలలో తనిఖీలు నిర్వహించడం జరిగినది,జిల్లా



ఎస్పీ సుబ్బరాయుడు మరియు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గంజాయి నియంత్రణపై ప్రజలకు పలు గ్రామాలలో రైల్వేకోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ నాయుడు చిట్వేలి సబ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ రైల్వే కోడూరు సబ్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రెడ్డి తనిఖీలు నిర్వహించిన అనంతరం యువతను స్థానిక ప్రజలను సమావేశపరిచి గంజాయి మాదకద్రవ్యాల పట్ల అవగాహన కల్పించారు గ్రామాలలో కళాశాల పరిసర ప్రాంతాలలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో ఎక్కడ గంజాయి అమ్ముతున్న త్రాగుతున్న చూసినవారు 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వవలసిందిగా సమావేశంలో వారు కోరారు ,యువతకు గంజాయి మత్తు గురించి వివరించారు నేటి సమాజంలో యువత మత్తుకు బానిస అవుతుందని యువకులు బాగా చదువుకుని మంచి ప్రయోజకులుగా ఎదిగి సమాజ ఉద్ధరణకు పాటుపడాలని,మత్తు పానీయాలకు గంజాయికి లోను కావద్దని ఆయన సూచించారు అంతేకాకుండా యువత గంజాయి మత్తుకు బానిస కావడంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి



యువత జీవితం సమాజంలో అభాసుపాలు అవుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఇది సమాజానికి శ్రేయస్కరం కాదని వారు సూచించారు ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి ఎస్సై మహేష్ నాయుడు చిట్వేలు ఎస్సై వినోద్ కుమార్ మరియు రైల్వే కోడూరు ఎస్సై ప్రసాద్ రెడ్డి పలువురు పోలీసు అధికారులు రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

# కల్తీపాల ఘటనలో మరొకరు మృతి

### 11కు చేరిన మృతుల సంఖ్య

**రాజమహేంద్రవరం, మార్చి 08 (రిపబ్లిక్ న్యూస్):**
తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గత నెలలో జరిగిన కల్తీ పాల ఘటనలో మరొకరు మృతిచెందారు. మూత్రపిండాల వైఫల్యంతో ఎస్.రామలక్ష్మి (73) ఆదివారం ఉదయం మృతిచెందినట్టు వైద్యులు ప్రకటించారు. దీంతో మృతుల సంఖ్య 11కు చేరింది. వారిలో ఆరుగురు మహిళలు ఉండగా, ఆరేళ్ల బాలుడుసహా ఐదుగురు పురుషులున్నారు. ఇంకా 9 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఐదు నెలల పాప, ముగ్గురు మహిళలు, ఇద్దరు బాలురతో కలిపి మొత్తం ఆరుగురు పురుషులు చికిత్స పొందుతున్నారు. ఇందులో నలుగురు డయాలసిస్ వైద్యం పొందుతుండగా, మిగతా ఐదుగురు వెంటిలేటర్‌పై డయాలసిస్ వైద్యం పొందుతున్నారు. ముగ్గురు పిల్లల్లో ఐదు నెలల పాపకు డయాలసిస్ చేస్తుండగా మిగతా ఇద్దరు పిల్లలు డయాలసివీసతోపాటు వెంటిలేటర్‌పై వైద్యం పొందుతున్నారు

# మహిళల సాధికారతతోనే సమాజ అభివృద్ధి

## - మంత్రి ఎన్ఎండి ఫరూక్

## ప్రతి రంగంలో మహిళలకు సమాన అవకాశాలే ప్రభుత్వ లక్ష్యం - మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి







**నంద్యాల, బ్యూరో మార్చి 08 (రిపబ్లిక్ న్యూస్)** మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుకు రావడమే సమాజ పురోగతికి పునాది అని జిల్లా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని మునిసిపల్ టౌన్ హాలులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ చదువు మనిషి జీవితాన్ని మార్చగల శక్తి అని పేర్కొన్నారు. విద్య లేనివాడు ప్రపంచంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేడని, ప్రతి కుటుంబం పిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధి ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల చదువును ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఇంజనీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినప్పటికీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతిలో చాలా మంది మహిళలే ఉన్నారని ఆయన తెలిపారు. వివాహం అయిన తర్వాత కూడా పిల్లలను చూసుకుంటూ చదువు కొనసాగిస్తూ పరీక్షలకు హాజరవుతున్న మహిళల పట్టుదల అభినందనీయం అన్నారు. గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన డీఎస్సీ పరీక్షలను మళ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ ప్రారంభం కావడం వల్ల యువతకు మంచి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలకు హాజరైన అభ్యర్థుల్లో మహిళలు అధిక శాతం ఉండటం మహిళల చైతన్యాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో జనన రేటు తగ్గిపోతున్న నేపథ్యంలో మానవ వనరుల అభివృద్ధి ఎంతో కీలకమని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. యువత సంఖ్య పెరిగితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, సమతుల్య జనాభా దేశ అభివృద్ధికి అవసరమని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా వేల కోట్ల రూపాయల సహాయాన్ని అందిస్తోందని ఆయన తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను నిలబెట్టడమే కాకుండా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఒక ముస్లిం మహిళ తన కృషితో సంవత్సరానికి దాదాపు రూ.36 లక్షల ఆదాయం సంపాదిస్తూ వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉదాహరణను మంత్రి ప్రస్తావించారు. ఇలాంటి మహిళలు సమాజానికి ప్రేరణగా నిలుస్తారని, వారిని ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఆడపిల్లల వివాహాల కోసం 'షాదీ ముబారక్' వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి వివరించారు. మహిళల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం నిర్మాణ రంగం సహా అనేక ఉపాధి రంగాల్లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు ఎక్కువగా పనిచేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒక ఇంటి నిర్మాణంలోనే అనేక రకాల పనులు ఉంటాయని, వాటిని నేర్చుకుంటే స్థానిక యువతకు మంచి ఆదాయం లభిస్తుందని సూచించారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

### మహిళల పురోగతే నిజమైన అభివృద్ధి

**శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని మహిళలందరికీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించిన చారిత్రక నిర్ణయం తీసుకున్న నాయకుడు ఎన్టీఆర్ అని ఆయన గుర్తు చేశారు. మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం కార్యక్రమం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల ద్వారా మహిళలకు ఉపశమనం కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే మహిళలు వ్యవసాయం, వ్యాపారం, స్వయం ఉపాధి వంటి అనేక రంగాల్లో పురుషులతో సమానంగా ముందుకు సాగుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదుగుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మహిళలు తమలోని ప్రతిభను వెలికి తీసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. అంతకుముందు మంత్రులు స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి లీలావతి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ వెంకట దాసు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## ప్రాంగణం, హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





**నంద్యాల, బ్యూరోమార్చి 08 (రిపబ్లిక్ న్యూస్):** డోన్ మండలం కొత్త బురుజు గ్రామంలో సోమవారం జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా ఆదివారం క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. పర్యటన సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమం విజయవంతంగా జరిగేలా చేపడుతున్న ఏర్పాట్లను ఆమె వివిధ కోణాల్లో సమీక్షిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు.

### సభా ప్రాంగణం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

కార్యక్రమం నిర్వహించనున్న సభా ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి విస్తీర్ణం, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, తాగునీటి సదుపాయం, పారిశుధ్య నిర్వహణ, నీడ కోసం షెడ్లు ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యే రైతులు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### హెలిప్యాడ్ పనుల పరిశీలన

ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగేందుకు ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా హెలిప్యాడ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. హెలిప్యాడ్ వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు ఫైర్ సేఫ్టీ చర్యలు, అత్యవసర పరిస్థితులకు అంబులెన్స్ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

### రవాణా, ట్రాఫిక్ నిర్వహణపై సూచనలు

కార్యక్రమం జరిగే ప్రదేశానికి చేరుకునే రహదారులను మరమ్మతులు చేసి రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ముందస్తు ప్రణాళిక రూపొందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

కార్యక్రమానికి విచ్చేసే ప్రజలకు తాగునీరు, పార్కింగ్ స్థలాలు, శానిటేషన్ సదుపాయాలు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### రైతులతో ఆత్మీయంగా ముచ్చటించిన కలెక్టర్

ఈ సందర్భంగా రైతులతో జిల్లా కలెక్టర్ ఆత్మీయంగా ముచ్చటించి వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఉన్నతాధికారుల సమీక్ష

ఈ పరిశీలనలో రాష్ట్ర భూసర్వే మరియు భూవ్యవస్థాపన శాఖ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ మరియు స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీమతి జి. జయలక్ష్మి, అదనపు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ శ్రీ జె. వెంకట మురళి పాల్గొని కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు చేపడుతున్న చర్యలపై వివరాలు తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు.

### సమన్వయంతో పని చేయాలి

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే సమగ్రంగా ప్రణాళిక రూపొందించి ఎలాంటి లోపాలు లేకుండా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను కచ్చితంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంట స్థానిక ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, పోలీసు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సోమవారంప్రజా సమస్యల పరిష్కార వేదిక

**అర్జీలు ఆన్లైన్లో లో నమోదు చేసుకోవచ్చు**

**-సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, బ్యూరోమార్చి 08 రిపబ్లిక్ న్యూస్** (సోమవారం) నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా, ఆన్లైన్లో కూడా సమర్పించవచ్చున్నారు. అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని ఆమె చెప్పారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

# గ్రంథాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు



**నంద్యాల ఫిబ్రవరి 8 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల శ్రీ పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించడం అయినది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ న్యాయమూర్తి , సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసమూర్తి – మహిళ స్వాతంత్ర సమరయోధులకు పూలమాలవేసి నివాళులు అర్పించడమైనది. తదుపరి కార్యక్రమంలో సాహితీ స్రవంతి నంద్యాల జిల్లా అధ్యక్షులు శ్రీనివాసు మూర్తి మాట్లాడుతూ సమాజంలో స్త్రీ పాత్ర యొక్క విశేష స్థానాలను వివరించారు. ఉపాధ్యాయులు అన్నెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూప్రతి ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహిళల విజయాలను, సమానత్వాన్ని, హక్కులను(ముఖ్యంగా లింగ సమానత్వం మరియు సాధికారత) ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు నీలకంఠమాచారి,కొప్పుల ప్రసాద్, మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులుఅన్నెం శ్రీనివాసరెడ్డి, నరేంద్ర, గ్రంథాలయ సిబ్బంది డి.మధు, ఆర్.ఇ.శ్రీధర్ గ్రంథాలయ పాఠకులు రాఘవరెడ్డి,ఆదినారాయణ, శ్రీనివాసులు, ప్రదీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల మహిళా వైద్యుల ఆధ్వర్యంలో

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**. స్త్రీ వ్యాధులపై వైద్య సదస్సు నిర్వహించిన నంద్యాల గైనకాలజి సొసైటీ**

**. సీనియర్ మహిళా వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మద లకు మహిళా దినోత్సవ సత్కారం**

**. మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత: డాక్టర్ నాగమణి,డాక్టర్ వసుధ**

**నంద్యాల ఫిబ్రవరి 8 (రిపబ్లిక్ న్యూస్) :**

ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నంద్యాల గైనకాలజి సొసైటీ, నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం ఆధ్వర్యంలో, గైనకాలజి సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నాగమణి, డాక్టర్ వసుధ, కోశాధికారి డాక్టర్ సునీత ల నిర్వహణలో మధుమణి సమావేశ భవనంలో జరిగిన కార్యక్రమంలో గైనకాలజి సొసైటీ స్త్రీ వ్యాధుల పై వైద్య సదస్సు నిర్వహించారు. సదస్సులో వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ ఇందుమతి, డాక్టర్ వసుధ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ గీత, డాక్టర్ శిల్పా, డాక్టర్ సునీత వివిధ స్త్రీ వ్యాధులపై మల్టీ మీడియా సహకారంతో ప్రసంగించారు.

ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐ ఎం ఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర ఐ ఎం ఎ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు,డాక్టర్ మధుసూదన రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళ లను అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ నాగమణి,డాక్టర్ వసుధ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ "గివ్ టు గ్రైయిన్" నినాదం ప్రకారం మహిళల హక్కులు,సామాజిక న్యాయం కోసం కార్యచరణ ప్రధానం అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ మహిళా వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మద లకు మహిళా దినోత్సవ సత్కారం చేశారు. నవజీవన్ బధిరుల పాఠశాల బాలికలకు రెండు కుట్టు మిషన్లు కుట్టు పని శిక్షణ కోసం మహిళా వైద్యుల తరపున ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా వైద్యులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com